నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 26 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## గూడెంలో వైభవంగా రథోత్సవం


స్వామివారి రథోత్సవంలో ఈవో, ఆలయ సిబ్బంది

దండేపల్లి, ఫిబ్రవరి25 : దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో 8 రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సాలు ఆదివారంతో ముగిసాయి. చివరిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సప్తాహ భజనలు, పరిసమాప్తము, ఏకాంతసేవా తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ప్రధాన అర్చకులు రఘుస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, వేద పండితులు నారాయణశర్మ ఉన్నారు.

## పూలాజీ బాబా బాటలో నడవాలి | ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ధ్యాన కేంద్రం వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25 : పూలాజీ బాబా బాటలో నడవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో ఈ నెల 27,28న సద్గురు పూలాజీ బాబా ధ్యానకేంద్రం 10వ వార్షికోత్సవం నిర్వహించనుండగా, అందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు ఎందరో గురువులు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవీందర్, నాయకులు శ్యాంరావు, నారా ఆశన్న, రోజా, రాజు, అశోక్, కాశీనాథ్, శంకర్, పెంటు, రాందాస్ పాల్గొన్నారు.




# పవర్ లేని ప్రత్యేకాధికారులు

- చెక్‌పవర్ కల్పించక పోవడంతో జీపీల్లో ఇబ్బందులు
- ప్రభుత్వం నుంచి ఇంకా అందని ఉత్తర్వులు

హాజీపూర్, ఫిబ్రవరి 25 : మంచిర్యాల జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వీరు బాధ్యతలు స్వీకరించి 25 రోజులు గడుస్తున్నా చెక్ పవర్ కల్పించకపోవడంతో వివిధ రకాల బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇది వరకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు కలిపి చెక్ పవర్ ఉండేది. ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. పంచాయతీల్లో జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ ఇవ్వాల్సి ఉంది. ప్రత్యేకాధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శికి కలిపి జాయింట్ చెక్ పవర్ ఉంటుందని అధికారులు తెలిపారు. ఆర్థిక సంఘం నిధుల వినియోగం కోసం ప్రత్యేకాధికారులకు డిజిటల్ కీ ఇవ్వాల్సి ఉంటుంది. జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ నిధుల వినియోగం కోసం బ్యాంక్ చెక్‌లపై సంతకాలు మార్చాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో చెక్ పవర్ పెండింగ్‌లో ఉంది. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపు, పంచాయతీల నిర్వహణ, ఇతర బిల్లుల చెల్లింపుల కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని స్థానికులు అటు ప్రభుత్వంపై.. ఇటు అధికారులపై మండిపడుతున్నారు. ఇకనైనా ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ కల్పించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

# ఊరు ఉండమంటే.. వేదన వెళ్లమంటోంది..

## అటవీ శాఖ తీరుతో వణుకుతున్న 'రింగరీట్' గ్రామం

- భయాందోళనలో కొలాం గిరిజనులు
- అటు పులుల సంచారం.. ఇటు అధికారుల దౌర్జన్యం
- గ్రామాన్ని వదిలివెళ్తున్న ఒక్కో కుటుంబం


రింగరీట్ కొలాం గ్రామం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): అడవి తల్లి ఒడి నుంచి మరో కొలాం గ్రామం కనుమరుగు కాబోతున్నది. రాత్రింబవళ్లు తేడా లేకుండా నిత్యం అటవీ అధికారుల తనిఖీలు, వేధింపులు ఆ కొలాం గిరిజనులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. తమ చేలల్లో పనులకు వెళ్లినా.. పశువులను మేతకు తీసుకెళ్లినా.. పొయ్యిలకు కట్టెలు తెచ్చినా వారికి అటవీ సిబ్బందితో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఒక్కో కుటుంబం గ్రామాన్ని విడిచేందుకు సిద్ధమవుతున్నది. మరికొందరు ఉన్న ఊరును విడువలేక, అటు వేధింపులు తాళలేక సతమతమవుతున్నారు.

### పులుల మృత్యువాత తర్వాత..

దశాబ్దాల క్రితం ఏర్పడిన ఆ గ్రామం ఉన్నట్లు కొంత కాలం క్రితం వరకు చాలా మందికి పెద్దగా తెలియదు. 18 కొలాం కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. వాంకిడి మండల కేంద్రం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో రెండు వాగులకు అవతల పెద్ద పెద్ద గుట్టలకు ఆనుకొని రింగరీట్ గ్రామం ఉంటుంది. కొత్తవారు ఈ గ్రామంలోకి వస్తేనే గ్రామస్తులు భయాందోళనకు గురవుతుంటారు. ఇక ఇటీవల కాగజ్‌నగర్ అడవుల్లో పులుల మృత్యువాతకు ఈ గ్రామం యువకులే కారణమంటూ అటవీ అధికారులు తేల్చారు. ఈ ఘటనతో గ్రామం ఒక్కసారిగా వార్తల్లోకెక్కింది. నిందితులను అదుపులోకి తీసుకున్నారు కూడా. ఇక నాటి నుంచి ఇక్కడి కొలాం గిరిజనులకు కష్టాలు మొదలయ్యాయి. అటవీ అధికారులు నిత్యం గ్రామం చుట్టుపక్కలే పహారా కాస్తున్నారు.. ఈ గ్రామానికి చెందిన కొలాం రైతులకు ఉన్న చేలల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నారు. ఇక చేసేదేమీ లేక గ్రామాన్ని వదిలి వెళ్లిపోవాలని కొలాంలు భావిస్తున్నారు. ఇప్పటికే ఒక కుటుంబం గ్రామాన్ని విడిచి వెళ్లింది. మరికొందరు కూడా అదే బాటలో సిద్ధమవుతున్నారు. ఊరు మీద మమకారం ఉన్నా, వేధింపులు తాళలేక వెళ్లక తప్పని పరిస్థితులు వస్తున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గ్రామంలో ఇంటి కూల్చివేసి వెళ్లిన కుటుంబం


పాఠశాలలో చదువుతున్న కొలాం పిల్లలు

### వేదన భరించలేక పోతున్నాం..



పెద్ద పులికి విషం పెట్టి చంపారనే కారణంతో నా కొడుకు ఆత్రం జలపత్, గ్రామంలోని కోవ జంగును అటవీ శాఖోళ్లు పట్టుకుపోయిన్రు. నాటి నుంచి మా ఊరు మీద పడి తిరుగుతున్నరు. మమ్మల్ని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నరు. ఎప్పుడూ గ్రామం చుట్టే మకాం వేసి ఉంటున్నరు. పిల్లలు జైలుకు పోయిన బాధలో మేముంటే, వీళ్లు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నరు. చేనుకు వెళ్లాలంటే కూడా భయమేస్తున్నది.

**-ఆత్రం పోసుబాయి, గ్రామస్తురాలు**

### వదిలి పోవాలని అనుకుంటున్నం..



ఇటీవల అటవీ అధికారుల వేధింపులు ఎక్కువైనయ్. అందుకే ఊరు విడిచిపెట్టి పోదామని అనుకుంటున్నం. మా గ్రామానికి చెందిన ఇద్దరు పులికి విషం పెట్టి చంపిన్రని ఈ అధికారులే పట్టుకుపోయిన్రు. మేము అడవిలో ఉండేవాళ్లం. మా భూములూ ఇక్కడే ఉన్నయ్. పశువులను మేపేందుకు కూడా అడవికే పోతాం. సీసీ కెమెరాల్లో మా ఊరి యువకులు కనిపించిన్రనే కారణంతోనే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిన్రు. నాటి నుంచి గ్రామంలో తిరుగుతూ మమ్మల్ని వేధిస్తున్నరు. ఇగ పులుల కంటే వీళ్లతోనే భయమెక్కువైతంది. అందుకే గ్రామం విడిచి పోవాలని అనుకుంటున్నం.

**- కోవ మాణిక్‌రావ్, గ్రామస్తుడు**

### వన్యరక్షణ కోసమే తనిఖీలు



అడవులు నరికివేతకు గురికాకుండా చూడడంతో పాటు వన్యప్రాణుల రక్షణ మా బాధ్యత. ఈ క్రమంలో అటవీ ప్రాంత గ్రామాల్లో నిఘా పెంచాం. రింగరీట్ గ్రామంతోపాటు సర్కపల్లి, మరి కొన్ని గ్రామాలు కూడా అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇటీవల పులులపై విష ప్రయోగం చేసింది రింగరీట్ గ్రామంలోని యువకులే కాబట్టి ఈ ప్రాంతంలో నిఘా పెంచాం. ఈ గ్రామంలోని రైతులు అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్తీగలు పెట్టకుండా వారి వ్యవసాయ క్షేత్రాల్లో కూడా తనిఖీలు చేస్తున్నాం.

**- అప్పలకొండ, రేంజ్ అధికారి**


కాలబైరవునికి మొక్కుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

# ముగిసిన గాంధారీ ఖిల్లా జాతర

- మైసమ్మకు బోనాలు సమర్పించి.. మొక్కులు తీర్చుకున్న భక్తులు
- సంప్రదాయ నృత్యాల హోరు
- దర్బార్‌కు హాజరైన ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 25 : గాంధారీ ఖిల్లా మైసమ్మ జాతర ఆదివారం సాయంత్రం ముగిసింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ (బొక్కలగుట్ట పంచాయతీ సమీపంలోని) శివారు పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువైన మైసమ్మ తల్లిని దర్శించుకోవడానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి నాయక పోడ్ గిరిజనులు, గిరిజనేతరులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీదేవర ముఖ తొడుగులతో ప్రదర్శనలు ఇచ్చారు. సంప్రదాయ నృత్యాలతో హోరెత్తించారు. అక్కడే వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కాళభైరవునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజాదర్బార్‌లో పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ద్వారా రూ. 5 లక్షలు మంజూరు చేయించి జాతరలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. వచ్చే జాతర వరకు ఖిల్లా ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు తాగు నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో అత్యంత ప్రాచీనమైన, విశిష్ట చరిత్ర గల గాంధారీ ఖిల్లాను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మందమర్రి జడ్పీటీసీ రవి, బొక్కలగుట్ట సర్పంచ్ బొలిశెట్టి సువర్ణ, క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ పారిపెల్లి తిరుపతి, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, గిరిజన సంక్షేమ అధికారి గంగారాం, తహసీల్దార్ చంద్రశేఖర్, జాతర నిర్వాహకులు, జిల్లా నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర నాయకులు పసుల బుచ్చయ్య,పల్ల సత్యనారాయణ, మేచినేని రాజయ్య, గంజి రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెరాజు, అబ్దుల్‌అజీజ్ పాల్గొన్నారు.


మొక్కుతున్న మహిళ | పూజలు చేస్తున్న భక్తులు


లక్ష్మీదేవరను తీసుకొస్తున్న పూజారులు



బోనంతో వస్తున్న మహిళ


బాలాజీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కుటుంబ సభ్యులు

# వెంకన్నకు మొక్కి.. వెనుదిరిగి..

## ముగిసిన గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర

- పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్న భక్తులు
- ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పూర్ణకుంభంతో స్వాగతం

రెబ్బెన, ఫిబ్రవరి 25 : గంగాపూర్ గ్రామ శివారులో కొలువైన బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమై.. ఆదివారంతో ముసిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకొని వెనుదిరిగారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి-సోనేరావు దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో కుటుంబ సభ్యులంతా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి పొందిన గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జయరాం, సభ్యులు, ఈవో బాపురెడ్డి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రశేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీలు కోవ అరుణ, వేముర్ల సంతోశ్, ద్రుపతాబాయి, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు పెసరి మధునయ్య, సంగం శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు చెన్న సోమశేఖర్, మాజీ సర్పంచ్ పందిర్ల వినోద, నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు, వోల్వోజీ వెంకటేశం, జుమ్మిడి ఆనందరావు, పందిర్ల మధునయ్య, దుర్గం భరద్వాజ్, వినోద్‌జైస్వాల్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, సభ్యులు లెంగుగురె గంటుమేర, మోడెం రాజాగౌడ్, బోంగు నర్సింగరావు, దుర్గం అన్నాజీ, చల్లూరి గంగయ్య ఉన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

## సమ్మక్క-సారలమ్మలకు పూజలు

కన్నెపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని గొల్ల గొట్టు గ్రామ శివారులో కొలువైన సమక్క-సారలమ్మలను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. బెల్లం, మేకలు, కోళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరికలు నెరవేరాలని అమ్మవార్లను వేడుకున్నారు.


సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటున్న భక్తులు